

ఘనంగా గెరిగమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణ

చింతామణి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తాలూకా లోని శింగనహళ్ళి గ్రామంలో గెరిగమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా శుక్రవారం కుంభాభిషేకం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన విమానగోపుర అష్టబంధన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




అలంకరణలో అమ్మవారు

బ్రదర్స్ భగ్గుమంటే.. అంతే..!







- నాడు సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చిన రమేష్ జార్కిహొళి
- నేడు డీసీఎంపై సతీష్ తిరుగు బావుటా..
- విందులు, సమావేశాలు..
- మరోసారి జోరుగా బెళగావి రాజకీయం
- విభేదాలతో కలకలం
- అప్పుడు, ఇప్పుడు మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌తోనే పొసగని వైనం..

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో బెళగావికి చెందిన జార్కిహొళి కుటుంబం దశాబ్దాల కాలంగా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. అయితే వారికి కోపం వస్తే మాత్రం ఎంత దూరమైనా వెళ్తారనేది మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మీహెబ్బాళ్కర్‌కు డీకే శివకుమార్ మద్దతు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారనే కారణంతోనే విభేదించిన రమేష్ జార్కిహొళి 2019లో సంకీర్ణ ప్రభుత్వం కూలేందుకు కారణమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రజాపనుల శాఖా మంత్రి సతీశ్‌జార్కిహొళి వర్సెస్ స్త్రీ శిశుసంక్షేమశాఖా మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌ల మధ్య విభేధాలు తారస్థాయికి చేరుతున్నాయి. మంత్రి సతీశ్ జార్కిహొళి ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆప్తుడు కాగా లక్ష్మీహెబ్బాళ్కర్ డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకేశివకుమార్‌కు ఆప్తురాలనే ముద్ర ఉంది. బెళగావి రాజకీయ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని మార్చిన దాఖలాలు ఉన్నాయి. ప్రత్యేకించి జార్కిహొళి బ్రదర్స్‌తో పెట్టుకుంటే తీవ్రమైన పరిణామాలు ఉంటాయనేది గతంలో రుజువైంది. ప్రస్తుతం బెళగావికి చెందిన ఇద్దరు కీలకమంత్రుల మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. ఇదే పరిస్థితి మరింతకాలం ముందుకెళ్తే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా పెను పరిణామం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బెళగావికి చెందిన సీనియర్ నేత సతీశ్ జార్కిహొళి ప్రజాపనులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా వ్యవహరిస్తున్న లక్ష్మీ హెబ్బాళ్కర్‌తో సతీశ్‌జార్కిహొళికి విబేధాలు ఉన్నాయి. వీటికి ఆజ్యం పోసేలా డీసీఎం డీకే శివకుమార్, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌కు మద్దతు ఇస్తున్నారనేది కూడా పార్టీ వర్గాల్లోనే గుసగుసలు సాగుతున్నాయి. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ రాలేదు. అయితే బీజేపీకి అత్యధికంగా వందస్థానాలు వచ్చాయి. అనూహ్యంగా జేడీఎస్‌తో చేతులు కలిపి కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏడాదిన్నరపాటు కుమారస్వామి సీఎంగా సజావుగా పాలన సాగింది. అప్పట్లో మంత్రులుగా ఉన్న డీకే శివకుమార్, రమేశ్ జార్కిహొళిల మధ్య విభేదాలకు ఓ సహకార సంఘం ఎన్నికలు కారణమయ్యాయి. లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు డీకే శివకుమార్ మద్దతు ఇచ్చారు. దీంతో జీర్ణించుకోలేని రమేశ్ జార్కిహొళి ఏకంగా 17మంది ఎమ్మెల్యేలను లాగేసి సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చారు. ఆ తర్వాత రమేశ్ జార్కిహొళి బీజేపీలో చేరి మంత్రి అయ్యారు. ప్రస్తుతం బెళగావికి సంబంధించిన ప్రతి విషయంలోనూ డీసీఎం జోక్యం పెరుగుతోందనేది సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహొళి బహిరంగంగానే విమర్శలు చేస్తూ వచ్చారు. తాజాగా సీఎల్పీ భేటీలో సోమవారం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా సమక్షంలోనే సతీశ్ జార్కిహొళి, డీసీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలను ఖండించారు. బెళగావిలో కాంగ్రెస్ కార్యాలయాన్ని లక్ష్మీ హెబ్బాళ్కర్ అద్భుతంగా నిర్మించారని డీసీఎం తెలిపారు. అందుకు సతీశ్ జార్కిహొళి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రమేశ్ జార్కిహొళి రూ.5కోట్ల విలువైన స్థలాన్ని పార్టీకోసం కేవలం రూ.15లక్షలకు ఇప్పించారని, నిర్మాణాలకు తాను భారీగా విరాళం ఇచ్చానన్నారు. ఒక్కరి ద్వారానే పార్టీ భవనం నిర్మితమైందనేది సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. బెళగావి రాజకీయాల్లో మరొకరి జోక్యాన్ని మేం సహించేది లేదని సతీశ్ జార్కిహొళి వెల్లడించారు. ఇందుకు మరో కారణం కూడా లేకపోలేదు. జనవరి 1న సతీశ్ జార్కిహొళి సీఎంతోపాటు మంత్రులకు విందు ఇచ్చారు. అప్పట్లో డీసీఎం టర్కీ దేశ పర్యటనలో ఉన్నారు. తాజాగా బుధవారం సతీశ్‌జార్కిహొళి బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ కేపీసీసీకి కొత్త సారధి కావాలన్నారు. అయితే తాను అధ్యక్షుడు కావాలని భావించడం లేదన్నారు. 2023లో ఉన్న ఊపు ప్రస్తుతం పార్టీలో లేదని, క్రియాశీలకంగా పనిచేసే నాయకుడికి అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. అయితే లక్ష్మీహెబ్బాళ్కర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో ఉండడంతో ఆమె స్పందించలేదు. లేనిపక్షంలో వివాదం మరింత ముందుకెళ్లేది.

డీకేశీని దూరంగా ఉంచా: రమేశ్ జార్కిహొళి

బెళగావి కాంగ్రెస్ భవన నిర్మాణ విషయమై సాగుతున్న వ్యాఖ్యలపై ప్రస్తుతం బీజేపీ నేతగా వ్యవహరిస్తున్న రమేశ్ జార్కిహొళి, సోదరుడు, మంత్రి సతీశ్ జార్కిహొళికి మద్దతుగా నిలిచారు. తాను కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నప్పుడు డీకే శివకుమార్‌ను బెళగావి విషయంలో జోక్యానికి అవకాశం ఇవ్వలేదన్నారు. బెళగావిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యాలయానికి 1.27 కోట్ల రూపాయలు ఇచ్చానని, అయితే నిర్మాణంలో గోల్‌మాల్ జరిగిందన్నారు. అప్పట్లో ఎమ్మెల్యేలు రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. వీరి వివాదం ఇంకా కొనసాగితే మరిన్ని పరిణామాలు తప్పవనిపిస్తోంది.

వారంలోనే రెండోసారి రాష్ట్రానికి సుర్జేవాలా

పార్టీ వ్యవహారాలకు సంబంధించి బహిరంగంగా ఎవరూ మాట్లాడరాదని పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాలా సోమవారం సీఎల్‌పీతో పాటు మంత్రులు, పార్టీ పదాధికారుల సభలో దాదాపు హెచ్చరించేలా ఆదేశించారు. అయినా ఎటువంటి మార్పులేదనే రీతిలో వ్యాఖ్యలు సాగుతున్నాయి. పార్టీ అధ్యక్షుడిని మార్పు చేయాలని మంత్రి సతీష్ జార్కిహొళి డిమాండ్ చేయడం అందుకు ధీటుగా డీకే శివకుమార్ కేపీసీసీ పదవి అంగట్లో సరుకు కాదని తిప్పి కొట్టడం తెలిసిందే. దీంతో సుర్జేవాలా శుక్రవారం రాష్ట్రానికి మరోసారి వచ్చారు. గతంలో చర్చించిన బెళగావిలో ఈనెల 21న జరిగే గాంధీభారత్ సభ విజయవంతం కోసం ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం వచ్చారు. బెంగళూరు నుంచి బెళగావికి డీసీఎం డీకే శివకుమార్, మంత్రి సతీష్‌జార్కిహొళి ఒకే విమానంలో ప్రయాణించినా ఎవరికి వారుగానే అనేలా వ్యవహరించినట్లు సమాచారం. పార్టీలో విభేదాలకు చెక్ పెట్టడానికి అధిష్టానం జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.

సభాపతిని సాగనంపుదాం..!

● హొరట్టిపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ కసరత్తు



బసవరాజ హొరట్టి

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టిపై వేటు వేయాలని అధికార కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు ప్రారంభించింది. బెళగావి శాసన సభ శీతాకాల సమావేశాల వేళ చివరిరోజున మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, బీజేపీ సభ్యుడు సీటీ రవిల మధ్య తలెత్తిన వివాదంలో సభాపతి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు మండిపడుతున్నాయి. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల ఎమ్మెల్సీ సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలు చేశారని ఫోరెన్సిక్‌లో రుజువైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే సభాపతి మాత్రం అటువంటి వ్యాఖ్యలు రికార్డు కాలేదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సీఐడీ విచారణకు సభాపతి అనుమతులు ఇవ్వలేదు. ఈ కారణాలతోనే సభాపతిపై అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా ఆలోచన చేస్తున్నాయి. సుదీర్ఘకాలంలో జేడీఎస్‌లో కొనసాగిన హొరట్టి ఇటీవలి ఎన్నికల్లో బీజేపీలో చేరి సభాపతి అయ్యారు. ఆయన పరిషత్‌లో సీనియర్ సభ్యుడిగా ప్రత్యేకంగా గౌరవిస్తారు. కానీ బెళగావిలో వివాదం పట్ల ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. పరిషత్‌లో మొత్తం సభ్యులు 75మంది. 38మంది సభ్యుల మద్దతు ఉండేవారికి సభాపతి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి 33మంది ఉండగా, బీజేపీ నుంచి 29మంది జేడీఎస్ 8మంది ఉన్నారు. ఒకరు ఇండిపెండెంట్ సభ్యుడు కాగా సభాపతి ఒకరు. మూడుస్థానాలు ఖాళీగా ఉన్నాయి. సభాపతితో కలిపితే బీజేపీ-జేడీఎస్ కూటమికి 38మంది మద్దతు ఉంది.

ఇండిపెండెంట్‌గా ఉండే లఖన్ జార్కిహొళి బీజేపీకి మద్దతు ఇస్తే ఎటువంటి ఢోకా ఉండదు. అయితే జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పదవీకాలం ఈనెల 27తో ముగియనుంది. ప్రస్తుతం ఖాళీగా ఉండే మూడుస్థానాలు కలిపి ఒకేసారి 4 స్థానాలకు ప్రభుత్వం నామినేట్ చేసుకుంటే కాంగ్రెస్ బలం 37కు పెరుగుతుంది. అప్పుడు ఇండిపెండెంట్ మద్దతు కూడా పొందితే 38మంది మద్దతుతో సభాపతిని మార్చే అవకాశం ఉంది.

ఇన్నాళ్లు.. ఏం చేస్తున్నారు..?

● రైతులను మోసగిస్తుంటే కనిపెట్టలేరా..? ● అధికారులపై మంత్రి శివానంద పాటిల్ ఆగ్రహం



సమావేశంలో మంత్రి శివానంద పాటిల్, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ)లో రైతులను మోసగిస్తుంటే ఏం చేస్తున్నారని, పంటలు తెచ్చుకుని అమ్ముకునేందుకు వచ్చిన రైతుల నుంచి 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నా ఎందుకు అడ్డుకోలేదని రాష్ట్ర అగ్రికల్చర్ ప్రొడెక్టు మార్కెటింగ్ కమిటీ మంత్రి శివానంద ఎస్. పాటిల్ ఏపీఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉప లోకాయుక్త కమిషన్ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం నగరానికి వచ్చిన మంత్రి ఏపీఎంసీలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఏపీఎంసీ కమిటీ అధ్యక్షుడు కట్టమనే నాగేంద్ర, ఉపాధ్యక్షుడు రామన్న లతో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డులో దళారులు రైతుల నుంచి అదనపు కమీషన్ తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొందరు వ్యాపారం చేయనోళ్లు కూడా ట్రేడింగ్ లైసెన్స్ పొందారు అదెలా సాధ్యమని అని మంత్రి కమిషనర్ నంజుండే స్వామిని ప్రశ్నించారు. ఇంతక ముందు ట్రేడింగ్ లైసెన్సును 10 ఏళ్ల కాలం వరకూ వ్యాలిడిటీ ఉందని, దానిని ఐదేళ్లకు కుదించాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులో కమీషన్ మోసాలు పెరిగాయని లోకాయుక్తే గుర్తించిందన్నారు. కొందరు అధికారులు ఏపీఎంసీ ఆదాయం తగ్గడానికి సొంత ఆదాయం కోసం పనిచేస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో ఒక వ్యాపారానికి లైసెన్సు పొంది ఇంకో వ్యాపారం చేయడాన్ని అనుమతించడంపై కమిషనర్‌ను మంత్రి నిలదీశారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ అకౌంట్‌లో ఎంత మొత్తం నిల్వ ఉండేది. పూర్తి వివరాలు సేకరించారు. ఏపీఎంసీకి మొత్తం 21 అకౌంట్లు ఉంటే అవన్నీ తగ్గించి కేవలం 4 అకౌంట్లు మాత్రమే నిర్వహించాలని మంత్రి సూచించారు. ఎంత మంది స్టాఫ్ ఉండేది. కాంట్రాక్టు సిబ్బందిపై ఆరా తీశారు. ఏపీఎంసీకి ఉన్న మూడు గేట్లకు బదులుగా రెండు గేట్లు తెరవాలని సూచించారు. కమిటీ అధ్యక్షుడు కట్టమనే నాగరాజు, ఉపాధ్యక్షుడు నేరుగా మంత్రితో కమిషనర్ శైలిపై ఫిర్యాదు చేశారు. రాష్ట్ర మార్కెట్ యార్డు కమిషనర్‌తో మాట్లాడి 20 ఏళ్ల కు పైబడి పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని సూచించారు. వీరితోపాటు ఏపీఎంసీ కమిటీ సభ్యులు ఎస్. వెంకటనాయుడు, మందాలప్ప, యల్లప్ప, విశ్వనాథ్, అబ్దుల్లా నజీర్ సాబ్, పంపన్నగౌడ, సిద్దప్ప, బసవరాజు, గవిసిద్దన్నగౌడ, ప్రభాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు నిర్మాణానికి రూ.5 కోట్లు : మంత్రి

బళ్లారిలో ఎండు మిరప మార్కెట్ యార్డు నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కోసం రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేస్తామని మంత్రి శివానంద పాటిల్ హామీ ఇచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన మంత్రి జిల్లాలో మిరప అధికంగా పండిస్తున్నారని, మిర్చి యార్డు నిర్మాణానికి 23 స్థలం కేటాయించామన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కనీసం 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తే మంచిదన్నారు. పీపీపీ మోడల్ లో నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయని కానీ అది సాధ్యం కాదన్నారు. యార్డు నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరగనుం దన్నారు. యార్డు నిర్మాణానికి డీపీఆర్ కూడా సిద్ధం చేశామన్నారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వీరితో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్, నాగిరెడ్డి, పి. శ్రీనివాసులు, మంజునాథ్, దొడన్నగౌడ, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి సోమణ్ణతో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

సమస్యలపై ఆరా..

● రైల్వేస్టేషన్లను పరిశీలించిన కేంద్రమంత్రి సోమణ్ణ

మహదేవపుర, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కావేరినగర్, వైట్‌ఫీల్డ్, దొడ్డనెక్కుంది, మున్నేకొళ్ళాల, పణత్తూరు, కార్తీకనగర్, కార్మెల్‌రామ్ రైల్వేస్టేషన్‌లను కేంద్రరైల్వే సహాయమంత్రి సోమణ్ణ పరిశీలించారు. అనంతరం గరుడాచార్‌పాళ్య వార్డులోని కావేరినగర్ ప్రాంతాన్ని సందర్శించి వర్షపునీటి కాలువ, యూజీడీ, స్కైవాక్, అండర్ పాస్ నిర్మాణాల స్థితిగతులను పరిశీలించి సమాచారం పొందారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి సోమణ్ణ మాట్లాడుతూ హూడి అండర్‌పాస్ నుంచి సాదరమంగళ, ఐటీపీఎల్‌కు వెళ్లేలా అండర్‌పాస్ నిర్మాణం, కాడుగూడి సిద్దార్థ లే అవుట్‌లోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వెళ్లేమార్గంలో అండర్‌పాస్ నిర్మాణం, బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు పాదచారి మార్గం నిర్మించే అంశాలపై సంబంధిత అధికారులకు సూచన చేసినట్టు తెలిపారు. కాగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రోడ్డు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయనున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి గురించి కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, రైల్వేశాఖ డివిజనల్ మేనేజర్ అమితేశ్, హోబళి బీజేపీ అధ్యక్షుడు మనోహరరెడ్డి, రూరల్ అధ్యక్షుడు నటరాజ్, మాజీ కార్పొరేటర్ హగదూరు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు ఎల్ రాజేశ్, బాబురెడ్డి, హూడి పిళ్ళప్ప, ఎల్ సోమశేఖర్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హోసూరు మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లిగడ్డలు

ఉల్లి ధరలకు రెక్కలు..!

హోసూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా పండించే చిన్న రకం ఉల్లి ధర అమాంతం పెరిగింది. నిన్న, మొన్నటి దాకా రూ.70 ఉన్న కేజీ ధర శుక్రవారం కిలో రూ.100 పలికింది. కృష్ణగిరి జిల్లాతోపాటు పొరుగున సరిహద్దు ప్రాంతాల్లో ఉల్లి సాగు తగ్గడం కూడా కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా చిన్న ఉల్లిపాయ సాగు చేస్తుంటారు. అదేవిధంగా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాల్లో కూడా సాగు చేస్తుంటారు. ఇక్కడి పంటలు స్థానికంతో పాటు విదేశీ మార్కెట్‌లకు కూడా ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో దిగుబడి తగ్గడంతో సరిహద్దుల్లో పండించిన చిన్న ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగింది.

రైల్వేలతో సరి..!

- 17 ప్రాజెక్టులకు ముగిసిన సర్వేలు
- కొత్త మార్గాల్లో పట్టాలెక్కని రైళ్లు
- అనుమతులివ్వని రైల్వే బోర్డు
- పూర్తి కాని యాదగిరి-అల్మట్టి ప్రాజెక్టు

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ దశాబ్దకాలంలో భారీగా కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందని చెప్పుకొంటున్నా కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు నెట్‌వర్క్‌గా ఉండే నైరుతిరైల్వేలో కొత్త మార్గాల్లో రైళ్లు పట్టాలెక్కడం గగనమవుతోంది. నైరుతి రైల్వే పరిధిలో హుబ్బళ్ళి, బెంగళూరు, మైసూరు సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్లలో 3,692 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్ ఉంది. ఇది మరింత విస్తృతం కావాలంటే రాష్ట్రం నుంచి ఆర్థిక సహకారం అవసరంగా ఉంది. ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్‌లకు అనుబంధంగా కొత్త మార్గాలను రైల్వేనెట్‌వర్క్‌ను విస్తరింపచేయాల్సి ఉంది. ఇలా 17 రైల్వే ప్రాజెక్టులకు సర్వేలు పూర్తి అయినా అవి ప్రగతిదశకు నోచుకోలేదు. ప్రాథమికంగా జరిపిన సర్వేలో లాభనష్టాలపైన నివేదిక సమర్పించారు. గ్రాంట్లు, ఆసక్తి కొరత వంటి కారణాలతో కొత్త రైల్వేమార్గాలు సర్వేలకే పరిమితంగా మారాయి. రైల్వేబోర్డు వీటికి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కేంద్రంలో ఎన్డీయే-3 ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రానికి చెందిన సోమణ్ణ రైల్వేశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కొత్త ప్రాజెక్టులపై ఆశ నెలకొంది. అయితే కేంద్రమంత్రులైన ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె సహకారం కూడా కీలకమవుతోంది. నైరుతిరైల్వేకు సాధనలో మంచి పేరున్నా



నైరుతి రైల్వే ప్రధాన కార్యాలయం (హుబ్లీ)

సంవత్సరం	ప్రాజెక్టు పేరు	కి.మీ
2007-08	తాళగుప్ప - హొన్నావర	82
2008-09	విజయపుర - శహబాద్	157
2005-06	అల్మట్టి నుంచి కుప్పగల్	180
2009-10	బెంగళూరు - నంగ్లి	120
2010-11	యాదగిరి - అల్మట్టి	162
2010-11	ఆనేకల్ రోడ్డు - బిడది	48
2010-11	గదగ్-హావేరి	53
2011-12	తుమకూరు - చామరాజనగర	181
2014-15	సిరుగుప్ప - సింధనూరు	145
2018-19	సేలం - చన్నసంద్ర	
	సేలం - కెఆర్ పురం	
2019-20	మైసూరు - కుశాల్‌నగర్	89
2022-23	గంగావతి - ధరోజి	36
2022-23	బయ్యప్పనహళ్ళి - హోసూరు	48.5
2022-23	హొస్పేట - బళ్ళారి డబుల్‌ట్రాక్	65
2022-23	గంగావతి - బాగల్కోటె	158
2022-23	బళ్ళారి - చిక్కజాజూరు	185



మౌలిక సదుపాయాల అమలు నత్త నడకన సాగుతోంది. ఏటా వాయిదాలు పడడమే కానీ కొత్త ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. గదగ్-హొంబళ వద్ద ఫ్లై ఓవర్ ఏడేళ్లుగా నిర్మాణ దశలోనే ఉంది. యాదగిరి - అల్మట్టి ప్రాజెక్టు 14ఏళ్లుగా ముందుకు కదలడం లేదు. సుదీర్ఘకాలంగా కేంద్రంలో ప్రహ్లాద్‌జోషి మంత్రిగా ఉన్నా గదగ్‌లో ఫ్లై ఓవర్ జాప్యం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.



మహమ్మద్ రఫీ నిర్మించిన శివుని ఉపాలయం

దేవుడు చేసిన మనుషులు

హిందూ దేవుళ్ల సేవలో ముస్లింలు

ఓబుళదేవరచెరువు, జనవరి17(ఆంధ్రజ్యోతి): సేవ, భక్తికి మతం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి. హిందూ దేవాలయాలను నిర్మిస్తూ మతసామరస్యానికి ప్రతీకగా మారాడు. ఆయనే మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ. ఈయన ఎం.కొత్తపల్లి బండలపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణంలో శివుడికి ఉపాలయం నిర్మించాడు. అంతేకాక నిత్య పూజలు నిర్వహింపజేస్తున్నాడు.

ప్రాణాలు కాపాడాడని..

పదిహేనేళ్ల కిందట షేక్ మహమ్మద్ రఫీ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అప్పుడే తన ప్రాణాలు కాపాడమని పరమేశ్వరుడికి మొక్కుకున్నట్లు తెలిపాడు. ఈక్రమంలోనే ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. దీనికి ఆ శివయ్య చల్లని చూపే కారణమని భావించిన షేక్ మహమ్మద్ రఫీ అయ్యప్ప ఆలయం ఆవరణలో శివుడి ఉపాలయాన్ని రూ. మూడు లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. శివ లింగాన్ని ప్రతిష్ఠింపజేసి నిత్య పూజలు జరిగేలా చూస్తున్నాడు. ప్రతిరోజు శివాలయం వద్ద కొంత సమయం గడపడం అలవాటు చేసుకున్నాడు. తనవంతుగా దైవకార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాడు.



అయ్యప్పకు పూజాసామగ్రి అందజేస్తున్న నిజాం (ఫైల్)

అయ్యప్ప సేవలో మరో ముస్లిం

కొత్తపల్లి గ్రామానికి చెందిన ముస్లిం టైలర్ నిజాం గత పదిహేనేళ్లుగా అయ్యప్ప స్వామి సేవలో పాల్గొంటున్నాడు. అయ్యప్ప మకరదీపోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా 46రోజులకు సరిపడే ధూప దీప, నైవేద్యం పూజా సామగ్రిని అందిస్తున్నారు. ఒకరోజు అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్నారు.

అందరి దేవుడు ఒక్కడే: టైలర్ నిజాం, ఎం. కొత్తపల్లి



అందరి దేవుడు ఒక్కడే. అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉండాలి. అందుకనే పదిహేనేళ్లుగా అయ్యప్ప సేవలో పాలు పంచుకుంటున్నా. అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నా. వినాయక చవితికి అవసరమైన ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నా.

తారతమ్యం వద్దు: మహమ్మద్ రఫీ, ఎం.కొత్తపల్లి



మనుషులకు కులమతాల తారతమ్యం వద్దు. దేవుడి సృష్టిలో అందరూ సమానమే. ఈ భావనతోనే శివాలయం నిర్మించి, శివలింగాన్ని ప్రతిష్ఠించా. నా ప్రాణాలు కాపాడిన శివుడిని కొలుస్తూ మొక్కు మేరకు ఆలయాన్ని నిర్మించా. నా వంతుగా అయ్యప్ప, ఇతర దేవుళ్ల సేవలో పాలు పంచుకుంటున్నా.

నత్తకు నడకలు నేర్వేలా..!





ఎంపీడీఓ కార్యాలయం

పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు
- రూ.4.35కోట్లకు.. రూ.1.07కోట్లే వసూలు

అనంతపురంరూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతపురం రూరల్ మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.35కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1.07కోట్లు మాత్రమే వసూలు చేశారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. మరి అధికారులు ఏమాత్రం లక్ష్యం చేరుకుంటారోనన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

కొండంత లక్ష్యం

అనంతపురంరూరల్ మండలం పరిధి 21 పంచాయతీలు, అర్బన్ మండలంలో నాలుగు పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పన్ను వసూలు చేస్తున్న గృహాలు, ఇతర సముదాయాలు 41,296 ఉన్నాయి. వీటికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4.35 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1.07కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.3.30కోట్లు వసూలు కావాల్సి ఉంది. మండలంలో ఏ పంచాయతీలోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో పన్ను వసూళ్లు లేవు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలే రూ.రెండు కోట్లకు పైబడి ఉన్నాయి. రూ.2.87కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.83.62 లక్షలు మాత్రమే వసూలు చేశారు. రెండు సంవత్సరాల పన్ను కలిపితే మొత్తంగా రూ.5.34కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇంతమొత్తంలో వసూలు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. కొందరు పంచాయతీ అధికారులు పనిచేసే గ్రామ పంచాయతీలు నగరానికి దగ్గరగా ఉండటంతో నిత్యం నగరంలో ఉంటూ తమ సొంత పనులు చేసుకుంటున్నట్లు సమాచారం. ఎప్పుడైనా కార్యాలయానికి వెళ్లినా ఎక్కువ సేపు అక్కడ ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరు సరిగా పట్టించుకోకపోవడం వల్లే పన్ను వసూళ్లు సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వసూళ్లపై ప్రత్యేక దృష్టి: వెంకటనాయుడు, ఈఓఆర్డీ



నూతన ప్రభుత్వం వెబ్‌సైట్‌ను స్వర్ణ పంచాయతీగా మార్పు చేసింది. ఈ నేపథ్యంలో వెబ్‌సైట్‌లో అన్ని వివరాల నమోదుకు దాదాపు నెల రోజులు సమయం పట్టింది. దీంతో పన్ను వసూళ్లలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం పన్ను వసూళ్లపైనే దృష్టి సారించాం. వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.



గ్రామ పంచాయతీల వారిగా పన్నుల వసూలు ఇలా..

గ్రామ పంచాయితీ	2023-24 అరియర్స్ రూ.	వసూలు రూ.	2022-25 వసూళ్ల లక్ష్యం రూ.	వసూలైంది రూ.
ఎ.నారాయణపురం	1.10కోట్లు	6.77లక్షలు	1.25కోట్లు	4.84లక్షలు
అక్కంపల్లి	4.81లక్షలు	2.84లక్షలు	6.02లక్షలు	2.77లక్షలు
ఆకుతోటపల్లి	9.02లక్షలు	4.07లక్షలు	27.32లక్షలు	10.14లక్షలు
ఆలమూరు	1.25లక్షలు	1.25లక్షలు	5.14లక్షలు	3.68లక్షలు
అనంతపురంరూరల్	12.86లక్షలు	8.67లక్షలు	36.72లక్షలు	8.17లక్షలు
చిన్నంపల్లి	1.48లక్షలు	1.18లక్షలు	2.29లక్షలు	1.12లక్షలు
చియ్యేడు	27వేలు	27వేలు	2.19లక్షలు	75వేలు
ఇటుకలపల్లి	46,338	46338	4.06లక్షలు	28,874
కక్కలపల్లిరూరల్	8.25లక్షలు	5.54లక్షలు	1.70లక్షలు	7.37లక్షలు
కక్కలపల్లికాలనీ	20.92లక్షలు	7.98లక్షలు	2.29లక్షలు	5.56లక్షలు
కామారుపల్లి	1.08లక్షలు	0	1.45లక్షలు	41వేలు
కందుకూరు	3.17లక్షలు	1.73లక్షలు	12.53లక్షలు	1.65లక్షలు
కాటిగానికాలువ	28వేలు	28,445	1.14లక్షలు	0
కట్టకిందపల్లి	1.03లక్షలు	1.03లక్షలు	5.86లక్షలు	4.20లక్షలు
కొడిమి	3.23లక్షలు	58,370	2.86లక్షలు	11,083
కురుగుంట	3.19లక్షలు	0	4.61లక్షలు	25,500
మన్నీల	2.32లక్షలు	56,890	1.89లక్షలు	73,823
నరసనాయునికుంట	1.15లక్షలు	69,970	1.35లక్షలు	2070
పూలకుంట	25,504	25,504	1.22లక్షలు	27,600
రాచానపల్లి	20.83లక్షలు	4.32లక్షలు	34.28లక్షలు	4.38లక్షలు
రాజీవ్‌కాలనీ	10.74లక్షలు	7.93లక్షలు	18.05లక్షలు	4.94లక్షలు
రుద్రంపేట	56.84లక్షలు	2.35లక్షలు	80.40లక్షలు	5.72లక్షలు
సోములదొడ్డి	4.79లక్షలు	2.94లక్షలు	7.21లక్షలు	88,864
తాటిచెర్ల	0	0	3.79లక్షలు	99,400
ఉప్పరపల్లి	8.93లక్షల	59,750	11.70లక్షలు	8.16లక్షలు

ఇద్దరు 'ఉత్తమ' సర్పంచ్‌లు



తిరుపాలు



రత్నమ్మ

అనంతపురం న్యూటౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇద్దరు సర్పంచులు ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికయ్యారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరి పేర్లను అధికారులు ఉత్తమ సేవా అవార్డుకు పంపారు. అందులో అనంతపురం జిల్లా నుంచి రాప్తాడు గ్రామ సర్పంచు సాకే తిరుపాలు, శ్రీసత్యసాయి జిల్లా నుంచి నల్లచెరువు సర్పంచు రత్నమ్మ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వీరు పురస్కారం అందుకోనున్నారు. పంచాయతీల్లో వీరు చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాసమస్యల పరిష్కారంలో చూపిన చొరవ తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు ఢిల్లీలో జరిగే వేడుకలకు సర్పంచు దంపతులకు ఆహ్వాన ఉత్తర్వులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు.

ఏపీసీ బాధ్యతల స్వీకరణ



ఏపీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శైలజ

అనంతపురం విద్య, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు నూతన ఏపీసీగా శైలజ శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న ఏపీసీ పోస్టుకు డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న ఆమెను నియమిస్తూ ఈ నెల 14న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆమె పూర్వపు స్థానంలో రిలీవ్ అయి ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ ఇక్బాల్, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ స్టాఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, గురుమునికృష్ణ, ఇతర డీపీఓ స్టాఫ్ ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ధర ఖాస్తే



- ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులు నిల్
- నేటితో ముగియనున్న గడువు
- భారీగా దరఖాస్తు రుసుం, ఫీజులే కారణం..

అనంతపురం అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అనంతపురంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత గతేడాది డిసెంబరు 17 నుంచి ఆ నెలాఖరుదాకా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. అప్పట్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో గడువును ఈనెల 7 దాకా పొడిగించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ 18వతేదీ సాయత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వులు జారీచేశారు. అయినా శుక్రవారం సాయంత్రందాకా ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. దరఖాస్తు చేసేందుకు కొన్ని గంటలు మాత్రమే సమయం ఉంది. దరఖాస్తు రుసుం రూ.15లక్షలు నాన్‌రిఫండబుల్ కావడం, వార్షిక పన్ను తొలి సంవత్సరం రూ.కోటి నిర్ణయించడమే దరఖాస్తులు రాకపోవడానికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ని'బంధనాలు'..!

జిల్లా కేంద్రంలో ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచాలని నిర్ణయించారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగుల వైశాల్యం ఉండాలని షరతు పెట్టారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన స్టాక్ మాత్రమే విక్రయాలు జరపాలని నిబంధన విధించారు. స్టోర్‌లో మద్యం తాగేందుకు అనుమతించరు. మద్యం, సిగార్లు, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను విక్రయించవచ్చుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు (నాన్ రీఫండబుల్) డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాలని షరతు పెట్టారు. దరఖాస్తు ఫీజు ఎక్కువ మొత్తం పెట్టడంతో వ్యాపారులు ప్రీమియం లిక్కర్ స్టోర్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఈ రోజే గడువు: రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనంతపురం

జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత డిసెంబరు నెలాఖరు దాకా గడువు ఇచ్చాం. దరఖాస్తులు రాకపోవడంతో ఈనెల 7వతేదీ దాకా పొడిగించాం. అయినా ఉపయోగం లేకపోవడంతో ఈనెల 18వతేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు గడువును రాష్ట్ర ఉన్నతాధికారులు పొడిగించారు. ఇప్పటి దాకా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. శనివారం ఆఖరి గడువు. ఔత్సాహికులు ఎవరైనా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను నేరుగా అందజేయవచ్చు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో బ్యూటీషియన్ కోర్సుకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 24 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని, ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9492583484 నంబరులో సంప్రదించాలని కోరారు.

20న ఏకసభ్య కమిషన్ రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ అంశంపై అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రంజన్ మిశ్రా ఈ నెల 20న జిల్లాకు వస్తున్నారని ఓఎస్డీ షాహిద్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీ అనంతపురం, 21న చిత్తూరు జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణ అంశంపై చర్చిస్తారని తెలిపారు. జిల్లాల్లోని వ్యక్తులు, సంస్థల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఇంకా.. సందిగ్ధమే..!

పరిశ్రమల మంజూరులో జాప్యం

- కొత్త పారిశ్రామిక పాలసీ.. జీవోతో సరి
- విడుదల కాని మార్గదర్శకాలు
- నిట్టూరుస్తున్న ఔత్సాహికులు

అనంతపురం అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంజూరుపై సందిగ్ధత నెలకొంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే 2023-2027 పారిశ్రామికాభివృద్ధి పాలసీని రద్దు చేశారు. గత ఏడాది అక్టోబరు నెలలో 2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీని ప్రవేశపెట్టారు. ఆ మేరకు జీవో జారీ చేశారు. కేటగిరీల వారిగా సబ్సిడీ ని నిర్ధారించారు. అయితే ఇప్పటి దాకా తగిన మార్గదర్శకాలు జారీ చేయలేదు. నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీ జీవో జారీ చేసి రెండున్నర నెలలు కావస్తున్నా ఇప్పటి దాకా క్షేత్ర స్థాయిలో అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు దరఖాస్తులతో పరిశ్రమల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా మార్గదర్శకాలు రాలేదని, త్వరలోనే వచ్చే అవకాశం ఉందని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎప్పటి నుంచి దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు కల్పిస్తారన్న సమాచారం ఆ శాఖ అధికారుల వద్దనే లేకపోవడంతో ఏం చేయాలో తోచని అయోమయంలో అధికారవర్గాలు కొట్టుమిట్టాడుతున్నాయి.

జీవో జారీతో సరి



పరిశ్రమల శాఖ కార్యాలయం

2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేయడంతోనే సరిపెట్టింది. అందులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి కేటగిరీల వారిగా సబ్సిడీని నిర్ధారించింది. ఓసీలకు 25 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళకు 35 శాతం సబ్సిడీ నిర్ధారించారు. గతంలో భారీ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ ఉండేదికాదు. ఈ సారి భారీ పరిశ్రమలకు 12 శాతం పెట్టుబడి రాయితీ వర్తింపజేశారు. అయితే ఆపరేషన్ గైడ్‌లైన్స్ జారీ చేయకపోవడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఔత్సాహికులకు తప్పని నిరీక్షణ

కూటమి ప్రభుత్వం కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించిన జీవో జారీ చేయడంతో ఇక తమ ఆశలు నెరవేరినట్లేనని ఔత్సాహికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే జీవో జారీ చేసి రెండున్నర నెలలు గడిచినా పథకాల అమలుకు సంబంధించి విధినానాలతో కూడిన ఆపరేషన్ గైడ్‌లైన్స్ జారీలో జాప్యం జరుగుతోంది. దీనిపై ఆయా వర్గాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. వైసీపీ పాలనలో తమకు తగిన ప్రోత్సాహం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటే ఇలా చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా మార్గదర్శకాలు విడుదల చేసి, పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించాలని కోరుతున్నారు.



త్వరలో గైడ్‌లైన్స్ వచ్చే అవకాశం: శ్రీధర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి



2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీని నిర్ణయించారు. అందుకు సంబంధించిన గైడ్‌లైన్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది. మార్గదర్శకాలు రాగానే కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పారిశ్రామిక ఔత్సాహికులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం.

నష్టాలు భరించలేక..

ఉద్యాన పంటల సాగుకు రైతులు దూరం

- ప్రకృతి, తెగుళ్ల దెబ్బకు తగ్గిన దిగుబడి
- కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం
- దానిమ్మ పంటను తొలగిస్తున్న అన్నదాతలు

శ్రీధరఘట్ట వద్ద దానిమ్మ చెట్లను తొలగిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఉద్యాన రైతు ఉసూరుమంటున్నాడు. ముఖ్యంగా గత ఐదేళ్లల్లో ఉద్యాన శాఖ నిర్లక్ష్యానికి గురైంది. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదం వల్ల మండలంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. గత ఐదేళ్లుగా కొత్తగా పండ్ల తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చూపడంలేదు. మండలం ఎల్‌బీ నగర్ గ్రామం ఒకప్పుడు ఉద్యాన పంటల సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఇక్కడి రైతులు దానిమ్మ, అంజూర, ద్రాక్ష, బొప్పాయి తదితర పంటలను సాగు చేసేవారు. ఇక్కడ రెండువేల హెక్టార్లలో దానిమ్మ పంట సాగు అయ్యేదే. పండిన పంటను చెన్నై, బెంగళూరు మార్కెట్లకు తరలించి అక్కడి నుండి ఇతర దేశలకు ఎగుమతి చేసేవారు. గత ప్రభుత్వంలో దానిమ్మ రైతులకు ప్రోత్సాహం లేకపోవడం, రాయితీలు రాకపోవడం, ఉధృతమైన తెగుళ్లను తట్టుకోలేక పలువురు రైతులు పంటను తొలగించారు. ప్రస్తుతం వందల ఎకరాలకు దానిమ్మ సాగు పడిపోయింది.

తుఫాన్ పరిహారం ఇవ్వలేదు



రెండేళ్ల కిందట తుఫాన్ కారణంగా దానిమ్మ పంట దిగుబడి పూర్తిగా నష్టపోయాం. అప్పటి ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. కానీ దాన్ని ఇవ్వకుండా అకౌంట్లో డబ్బులు డ్రా కాకుండా సస్పెన్స్‌లో పెట్టింది. 16 ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశా. గత ఏడాది వైరస్ వల్ల కాయలు పగిలిపోయి, రాలిపోయి తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఏడాది వైరస్‌ను తట్టుకొని దిగుబడి వచ్చి, మంచి ధర వస్తే పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయి.

- యర్రగుంట్ల వెంకటేశులు, ఎల్‌బీ నగర్

మూడేళ్లుగా నష్టమే



కరోనా, వైరస్ ఇతర తెగుళ్ల వల్ల దానిమ్మ పంటలో గత నాలుగేళ్లుగా నష్టాలే చూస్తున్నాం. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. దానిమ్మ కాయలు జామ కాయ పరిమాణం వచ్చిన తర్వాత రాలిపోతున్నాయి. సకాలంలో మందులను పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. ఈఏడాది ఇంట్లో తినేందుకు కూడా దానిమ్మ కాయలు దొరకడం లేదు. దానిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గోరంట్ల వెంకటేశులు, ఎల్‌బీ నగర్

కూటమి ప్రభుత్వం ప్రోత్సహించాలి



దానిమ్మ పంట సాగు చేస్తున్నా. దిగుబడి పెద్దగా లేదు. గిట్టుబాటు కావడంలేదు. గతంలో విదేశాలకు దానిమ్మను ఎగుమతి చేసేవాళ్లం. తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. ఈ తెగుళ్ల నివారణకు సరైనా సలహాలు సూచనలు ఇచ్చేవారు లేరు. గత ఐదేళ్లల్లో ఉద్యాన పంటల అభివృద్ధి గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. తుఫాన్, వర్షాలు కారణంగా పంటలు దెబ్బతిన్నా పరిహారం అందలేదు. జరిగిన నష్టం నుంచి కోలుకోలేక పోతున్నాం. కూటమి ప్రభుత్వమన్నా దానిమ్మ పంట సాగును ప్రోత్సహించి సబ్సిడీ పథకాలు అందించాలి.

- ధనుంజయ, రైతు, ఎల్‌బీ నగర్

తెగుళ్ల ధాటికి కుదేలైన రైతు

పండ్ల తోటల సాగు విస్తీర్ణం తగ్గిపోవడానికి పెట్టుబడి ఎక్కువ కావడం, ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందకపోవడం ప్రధాన కారణాలుగా రైతులు చెబుతున్నారు. ఎలాగోలా పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే అకాల వర్షాలు, అంతుచిక్కని తెగుళ్ల ధాటికి కళ్ల ముందే పంట దెబ్బతినడంతో ఉద్యాన రైతు కుదేలవుతున్నాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పంటలను తొలగించిన ఘటనలు ఉన్నాయి. నష్టం జరిగిన ప్రతిసారి యంత్రాంగం లెక్కలు రాసుకెళ్లడం మినహా రైతులకు ఒనగూర్చిన ప్రయోజనం శూన్యం. గత వైసీపీ ప్రభుత్వంలో సంభవించిన తుఫాన్‌కు సంబంధించిన పంట నష్ట పరిహారం ఇంతవరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వం మీ ఖాతాలోకి పరిహారం జమ చేశాయని చెప్పి సస్పెన్స్‌లో పెట్టి చేతులు దులుపుకుంది. పరిహారం ఇంత వరకు రాలేదని రైతులు అన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశ. శంకరనారాయణ కాయ్...

ఎన్టీఆర్ (వర్ధంతి)



అభిమానులచే 'అన్నగారు'గా పిలవబడి, రాముడు, కృష్ణుడు వంటి పాత్రలతో తెలుగువారి ఆరాధ్య దైవంగా నిలిచిన నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. గొప్ప నటుడు, ప్రజా నాయకుడు. సుమారు 400 సినిమాలలో నటించారు. నిర్మాతగాను, దర్శకుడిగాను వ్యవహరించారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో తనదైన నటనతో 'విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు' బిరుదాంకితులు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం 9నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. సినిమాల్లోనే కాక రాజకీయాల్లోనూ పలు రికార్డులు నెలకొల్పారు. 1996 జనవరి 18న కన్నుమూశారు.

ఒలివర్ హార్డీ (జయంతి)



ఒలివర్ నార్వెల్ హార్డీ 1892 జనవరి 18న జన్మించారు. అమెరికన్ కామిక్ యాక్టర్. లారెల్ అండ్ హార్డీ ద్వయంలో ఆయన ఒకరు. 1927-55 మధ్యన మూకీ సినిమాలతోపాటు టాకీలలో కలసి నటించారు. 1914లో తొలి సినిమా 'అవుట్ విట్టింగ్ డ్యాడ్'తోనే గుర్తింపు పొందారు. తన పార్ట్‌నర్ స్టాన్ లారెల్‌తో కలసి 107 షార్ట్ ఫిల్మ్‌లో నటించారు. 1957 ఆగస్టు 7న కన్నుమూశారు. హార్డీ సొంతూరైన జార్జియాలోని హార్లెమ్‌లో 'లారెల్ అండ్ హార్డీ మ్యూజియం'ను ఏర్పాటు చేశారు.

కేరీ గ్రాంట్ (జయంతి)




కేరీ గ్రాంట్ 1904 జనవరి 18న జన్మించారు. ఇంగ్లిష్ బార్న్ అమెరికన్ నటుడు. క్లాజిక్ హాలీవుడ్‌లో తనదైన గుర్తింపు పొందారు. నాటకాలనుంచి వెండి తెరపైకి వచ్చి నటన, హాస్యం పండించారు. 1940, 50లలో ఆయన సినిమాలు హాస్యానికి ఎంతో పేరొందాయి. అకాడమీ అవార్డ్‌కు రెండుసార్లు నామినేట్ అయ్యారు. ఉత్తమ నటుడిగా ఐదుసార్లు గోల్డెన్ గ్లోబ్ అవార్డు పొందారు. 'సెకండ్ గ్రేటెస్ట్ మేల్‌స్టార్'గా అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. 1986 నవంబరు 29న కన్నుమూశారు.

డానీ కాయె (జయంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు డానీ కాయె 1911 జనవరి 18న న్యూయార్క్‌లో జన్మించారు. అసలు పేరు డేనియెల్ కామిన్‌స్కీ. గాయకుడు, సంగీత దర్శకుడు, డ్యాన్సర్, కమెడియన్. అంతకుమించి మానవతావాది. ప్రత్యేకించి ఆయన నటించిన 17 సినిమాలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. వండర్‌మ్యాన్, ది ఇన్‌స్పెక్టర్ జనరల్, వైట్ క్రిస్మస్, ది కోర్ట్ జెస్టర్ వంటివి ప్రముఖమైనవి. 1954లో యునిసెఫ్ తొలి రాయబారిగా వ్యవహరించారు. 1987 మార్చి 3న కన్నుమూశారు.

ఎస్ బాలచందర్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత సుందరం బాలచందర్ 1927 జనవరి 18న జన్మించారు. వీణా బాలచందర్‌గా సుపరిచితులు. బాల్యం నుంచే సంగీతంపై మక్కువతో రాణించారు. తమిళ సినిమా రంగంలో పేరొందిన దర్శకులు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించగా మరి కొన్నింటిలో ఆయనే నటించారు. పాటలు పాడడమే కాక సంగీత దర్శకత్వం వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తమిళ సినీరంగంలో చెరగని ముద్రవేశారు. 1990 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

భండారు అచ్చమాంబ (వర్ధంతి)



తొలి తెలుగు కథా రచయిత్రి, ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా పేరొందిన భండారు అచ్చమాంబ 1874లో కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతంలో జన్మించారు. 'అబలా సచ్చరిత్ర మాల' అనే గ్రంథాన్ని రచించగా కందుకూరి వీరేశలింగం పంతులు తమ చింతామణి ముద్రణాలయంలో ప్రచురించారు. ఇందులో వెయ్యి సంవత్సరాలలో ప్రసిద్ధి చెందిన భారత స్త్రీల కథలు ఉన్నాయి. మచిలీపట్నంలో తొలి మహిళా సంఘం 'బృందావన స్త్రీల సమాజం'ను స్థాపించారు. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' కూర్చిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుకు అక్క. కాగా 30వ ఏట 1905 జనవరి 18న మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో కన్నుమూశారు.

కేఎల్ సైగల్ (వర్ధంతి)



కుందన్ లాల్ (కేఎల్) సైగల్ 1904 ఏప్రిల్ 11న జమ్మూలో జన్మించారు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన గొప్ప గాయకుడు, నటుడు. హిందీ సినీ రంగంలో తొలి సూపర్‌స్టార్ ఆయనే. గమ్మత్తైన గొంతుతో ఎన్నో పాటలు ఆలపించి తనదైన ప్రత్యేకత చాటుకున్నారు. మొహ్మద్ రఫీ, లతా మంగేష్కర్, కిశోర్‌కుమార్, ముకేశ్‌లు సైతం ఆయనను సంగీతగురువుగా భావించారు. 15ఏళ్ల కెరీర్‌లో 36 ఫీచర్ ఫిల్మ్‌లో నటించగా 185 పాటలు పాడారు. అందులో సినిమా, భజనలు, గజల్స్ కూడా ఉన్నాయి. 1947 జనవరి 18న కన్నుమూశారు.

వీరయోధుల కుటుంబాలను ఆదుకోవాలి

విజయనగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించి వీరయోధుల కుటుంబాలను ఆదుకోవడం మన కర్తవ్యమని ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. ఆర్మీడే వేడుకల్లో భాగంగా గోవిందరాజనగర వార్డు కబడ్డీ మైదానంలో అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠాలకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ యువత రాణించాలని పిలుపునిచ్చారు. కాగా దేశసేవలో సైనికుల సేవలు అపారమని, వారి దేశభక్తి ఎన్నటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మోకాలి ఆపరేషన్లకు రోబోటెక్ సురక్షితం

» పీఈఎస్ కళాశాలలో లైవ్‌లో ఆపరేషన్

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మోకాలి, తుంటి ఆపరేషన్లకు రోబోటెక్ సురక్షితమని పీఈఎస్ మెడికల్ కళాశాల డైరెక్టర్ సురేశ్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఎలక్ట్రానిక్ సిటీ పీఈఎస్ మెడికల్ కళాశాలలో లైవ్‌లో నలుగురికి మోకాలిచిప్పల ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. కళాశాలలో నెలకో విభాగంపై జాతీయస్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నారు. బెంగళూరులోని ప్రముఖ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల ఆర్థోసర్జన్‌లతో పాటు దేశ వ్యాప్తంగా 200మంది నిపుణులు ఆధునాతన శస్త్రచికిత్సల చర్చాగోష్ఠిలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సురేశ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మోకాలిచిప్పల ఆపరేషన్ కొన్నేళ్లుగా సాగుతున్నా కొత్తగా వచ్చిన రోబోటెక్ విధానం చిన్నపాటి గాయంతో పూర్తి చేస్తుందని అభిప్రాయపడ్డారు. అధికంగా రక్తం, కోత ఉండదని, త్వరగా కోలుకునేందుకు వీలుందన్నారు. ఒకేరోజున మూడు ప్రముఖ రోబోటెక్ కంపెనీల భాగస్వామ్యంతో లైవ్‌లో నలుగురికి శస్త్రచికిత్సలు చేశామన్నారు. సాధారణ ఆపరేషన్లతో పోలిస్తే రోబోటెక్ రూ.60-70వేలు అధికమని కానీ త్వరగా రికవరీ అయ్యేందుకు వీలుందన్నారు. ప్రిన్సిపాల్, డీన్ హరిప్రసాద్ మాట్లాడుతూ వైద్య విధానంలో సాంకేతికత పెరిగిందన్నారు. రోబోటెక్ ద్వారా ఆపరేషన్లు ఉన్నా పరిమితికి మించి గాట్లు ఉండవన్నారు. త్వరితగతిన ఆపరేషన్ పూర్తి అవుతుందన్నారు. పీఈఎస్ మెడికల్ కళాశాలలో బీపీఎల్ కార్డుదారులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజికసేవలో భాగంగా ఐసీయూ విభాగంలోనూ సాధారణ చార్జీలతో వైద్యం అందిస్తున్నామన్నారు.



పీఈఎస్ మెడికల్ కళాశాల డైరెక్టర్ సురేశ్ కృష్ణమూర్తి తదితరులు

గుణాత్మక విద్య, పరిశోధనలు అవసరం

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సమాజానికి గుణాత్మకమైన విద్య పరిశోధనలు అవసరమని వీఎల్ఎస్ఐ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ సత్యగుప్త అభిప్రాయపడ్డారు. బీఎస్ఎంఐటీ కళాశాలలో కంప్యూటింగ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక ఆవిష్కరణలు అనే అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో ఉత్పాదనా రంగం పెరగాలంటే గుణాత్మకమైన విద్య, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత కీలకమన్నారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ రంగంలో విపులమైన అవకాశాలు ఉన్నాయని అయితే నైపుణ్యత లేక ఎక్కడికక్కడి వారు ఉద్యోగాలు సాధించ లేకపోతున్నారన్నారు. దేశంలో మొబైల్, ఎలక్ట్రిక్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల వాడకంలో 10శాతం మాత్రమే ఉత్పత్తి సాధ్యమవుతోందన్నారు. 2030 నాటికి 33శాతం పెరగనుందని అభిప్రాయపడ్డారు. 1980లో ఇస్రో సైకిల్‌పై రాకెట్ పరికరాలు రవాణా చేశారని 2023 నాటికి అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచమే భారత్‌వైపు చూసిందన్నారు. కళాశాల అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వై కులకర్ణి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్, డిప్యూటీ డైరెక్టర్ జీఎన్ కృష్ణమూర్తి, టీసీఎస్ సీనియర్ సైంటిస్ట్ ప్రశాంత్ మిశ్రా, సెడ గోపన్, ట్రస్టు చైర్మన్ నారాయణరావు మానె, డాక్టర్ సత్య గుప్త తదితరులు ఇతర రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



డాక్టర్ సత్యగుప్తాకు సన్మానం

దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలి

శిడ్లఘట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల సానుభూతికి బదులు వారి ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో ఎస్‌సిఐ నవజీవన సేవాసంఘం, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ విత్ డిజబిలిటీ, హెచ్‌సిఎల్ ఫౌండేషన్, జిల్లా దివ్యాంగులు - సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ, ఎంఆర్‌డబ్ల్యు, వీఆర్‌డబ్ల్యుల సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈఓ మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులు పలు రంగాలలు సాధనలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. చిన్నతనంగా భావించకుండా ఉత్తమంగా సాధించాలన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌సిఐ నవజీవన సేవాసంఘం అధ్యక్షుడు ఎన్ మునిరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు వ్యాయామ తర్ఫీదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తాలూకా కేంద్రంలో భవనాన్ని నిర్మించాలన్నారు. కనీసం మూడు నెలలకోసారి దివ్యాంగుల సమస్యలపై సమావేశం నిర్వహించాలన్నారు. తాలూకా, గ్రామ పంచాయతీలలో నిర్మించే ర్యాంప్, శౌచాలయాలు దివ్యాంగులకు అనుకూలంగా శాస్త్రీయంగా ఉండాలన్నారు. దివ్యాంగులకు వీల్‌చెయిర్‌స, క్రచెస్, వాకర్, వాకింగ్ స్టింగ్, దివ్యాంగ విద్యార్థులకు నోటు పుస్తకాలు, వెన్ను ప్రమాదానికి గురైన వారికి నిత్యం వాడే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవజీవన సంస్థ అధ్యక్షుడు మునిరాజు, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి నౌతాజ్, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు కిట్లు అందజేస్తున్న ఈఓ హేమావతి

కేఐఏడీబీ తీరుపై రైతుల సమావేశం



సమావేశంలో జిల్లా అధికారి, ఎమ్మెల్యే తదితరులు

దొమ్మసంద్ర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ పట్టణంలోని పురసభ కార్యాలయంలో రైతుల సమస్యలపై ప్రత్యేక సమావేశం జరిగింది. సర్జాపుర హోబళి పరిధిలో సుమారు 3వేల ఎకరాల భూమిని కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలెప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) భూస్వాధీనం చేసుకోవాలనే నిర్ణయాన్ని ఖండిస్తూ సమావేశంలో చర్చలు జరిపారు. బెంగళూరు జిల్లా అధికారి జగదీశ్, ఎమ్మెల్యే శివణ్ణ నేతృత్వం వహించారు. భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు కేసీ దేవరాజు మాట్లాడుతూ తమ ప్రాంతంలో రైతులతో ఎలాంటి సమావేశం నిర్వహించ కుండా భూస్వాధీనానికి సన్నద్ధం కావడాన్ని తప్పుబట్టారు. అనధి కారికంగా భూస్వాధీనం చేసుకునే చట్టాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఆనేకల్ తహసీల్దారు శశిధర్ మాడ్యా ల్ మాట్లాడుతూ తమ దృష్టికి రాకుండానే భూస్వాధీన ప్రక్రియ జరగడంతో ప్రభుత్వానికి, జిల్లా అధికారికి లేఖ రాసి రానున్న రోజుల్లో సమగ్ర చర్చలు జరుపుతామన్నారు. రైతులు సమర్పించిన వినతిని స్వీకరించిన అనంతరం బెంగళూరు జిల్లా అధికారి జగదీశ్ మాట్లాడుతూ మంత్రి ఎంబీ పాటిల్, సీఎం సిద్ద రామయ్యలకు సమస్యను వివరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, ఈఓ మం జునాథ్, భూస్వాధీనం పోరాట సమితి అధ్యక్షుడు కేసీ దేవరాజు, గౌరవాధ్యక్షుడు జై ప్రకాశ్, ఉపాధ్యక్షులు నాగేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, కోశాధికారి మధురెడ్డి, సంచాలకులు రామస్వామి రెడ్డి, తాలూకాలోని రెవెన్యూశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తెలుగు పాఠశాలకు నందన రవిచందర్ విరాళం

» విద్యార్థుల రవాణాకు రూ.2.10 లక్షలు



హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రవిచందర్

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాజి నగర్ ఓపిహెచ్‌రోడ్డు తెలుగు ప్రాథ మిక పాఠశాల విద్యార్థుల రవాణా కోసం నందన గ్రూప్ హోటల్స్ చైర్మన్ డాక్టర్ రవి చందర్ విరాళం ప్రకటించారు. మూడు నెలలకు అవసరమైన రూ.2.10లక్షల మొత్తాన్ని ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. డిసెం బరు నెలకు సంబంధించి రూ.70వేల చెక్కును హెడ్మాస్టర్ ఆర్ఎస్ ఉషారాణికి అందించారు. ఇదే సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ శివాజి నగర్ ప్రాథమిక పాఠశాలలో 66 మంది తెలుగు విద్యార్థులు ఉన్నారని, వీరిలో 60మంది బన్నేరుఘట్ట రోడ్డు జిడి మర మురికివాడ ప్రాంతంనుంచి వస్తారన్నారు. కొన్నేళ్లకాలంగా దాతల సహకారంతో ప్రత్యేక బస్సు సదుపాయం ఉందన్నారు. ఇటీవల దాతల నుంచి విరాళం రాకపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. ఇదే విషయాన్ని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజుతో చర్చలు జరిపిన మేరకు సానుకూలమైందన్నారు. ప్రస్తుతం రవిచందర్ డిసెంబరుకు సంబంధించి రూ.70 వేల చెక్కును ఇచ్చారన్నారు. సుదూరం ఉండడంతో విద్యార్థులు అక్కడనుంచి పాఠశాలకు రావాలంటే మూడు బీఎంటీసీ బస్సులు మారి రావాల్సి ఉంటుం దన్నారు. విద్యార్థులు తప్పిపోతారని తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తారన్నారు. ప్రస్తుతం మూడు నెలలకు సరి పడే విరాళం సమకూరిందన్నారు. రవిచందర్ విరాళంపై హర్షం వ్యక్తం చేశారు. తెలుగు పాఠ శాల అభివృద్ధికి విద్యార్థుల సౌలభ్యం కోసం దాత లు సహకరించాలని కోరారు. పాఠశాల ఏర్పడి 110 సంవత్సరాలు అయ్యిందన్నారు.

ఆలయాల అభివృద్ధికి చేయూత

బొమ్మనహళ్ళి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మారుతి యువకసంఘం, శ్రీరామాం జనేయసమితి ట్రస్టు ఆధ్వర్యంలో వాణిజ్య భవనాన్ని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి ప్రారం భించారు. బొమ్మనహళ్ళి మెట్రో స్టేషన్ సమీపాన ఆలయానికి అనుబంధంగా భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తాము ఎప్పుడూ ముందంజలో ఉంటామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆలయాల ఉన్నతికి ఎప్పుడూ సహకారం ఉంటుందన్నారు. కాగా ఇక్కడి ఆలయంలో నిత్యం కైంకర్యాలకోసం వాణిజ్య భవనం ద్వారా వచ్చే ఆదాయాన్ని వినియోగించుకోనున్నట్టు తెలిపారు. భక్తుల సహాయ సహకారాలతోనే సాధ్యమన్నారు. శుక్రవారం ఏర్పాటైన శాంతి, గణపతి హోమం, ఇతర ధార్మిక కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ మంజునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు వేణుగోపాల రెడ్డి, సంపత్ కుమార్, ప్రకాశ్, మునిరెడ్డి, శ్రీనాథ్, జగదీశ్, నాగరాజరెడ్డి, సుమిత చంద్రారెడ్డి, బాబురెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో మాజీ కార్పొరేటర్ మంజునాథరెడ్డి తదితరులు

25 స్టార్టప్‌లకు బీఎంఎస్ ద్వారా సాయం

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జాతీయస్టార్టప్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎంఎస్‌లో జరిగిన ఉద్యమోత్సవ సదస్సులో 25 స్టార్టప్‌లకు ఆర్థిక సాయం ప్రకటించారు. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థల నుంచి 25 స్టార్టప్‌లు తమ పరిశోధనలు ప్రదర్శించాయి. ప్రిన్సిపాల్ బీమ్ శా ఆర్య అధ్యక్షతన సభ జరిగింది. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. సాంకేతిక, మెడికల్‌సైన్స్, అగ్రికల్చర్‌తోపాటు భిన్నమైన రంగాలకు సంబంధించి 20కుపైగా స్టార్టప్‌లలో పెట్టుబడులకు అవకాశాలు దక్కాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. కొన్ని స్టార్టప్‌లు ఉత్తమ ఐడియాలతోపాటు మార్కెట్‌లో సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఉత్తమంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.



సదస్సులో ప్రిన్సిపాల్ తదితరులు

హెచ్‌ఎంపీవీ పట్ల అవగాహన అవసరం

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటా నిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) పట్ల ప్రజలు అవగాహన పొందాలని ప్రముఖ పీడియాట్రిషన్, రెయిన్‌బో కన్సల్టెన్సీ రజత్ ఆత్రేయ అభిప్రాయపడ్డారు. శుక్రవారం హెచ్‌ఎంపీవీ పట్ల మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్‌తో భయం ఉందని ఇది భవిష్యత్తుకు అంటువ్యాధి కానుందనే ఆందోళన చెందుతున్నారన్నారు. ఇది సామాన్యంగా జలుబు వైరస్‌లాంటిదేనని అయితే శ్వాసకోశ సమస్య వస్తుందన్నారు. ఇది కొత్తవైరస్ కాదని 2001లోనే గుర్తించారన్నారు. చిన్నపిల్లలు, రెండేళ్లలోపు పిల్లలు, కేన్సర్‌తోపాటు ఇతరత్రా దీర్ఘకాల అనారోగ్యంతో ఉండేవారికి ప్రభావం చూపుతుందన్నారు. వైరస్ సోకితే జలుబు, దగ్గు, జ్వరం వస్తుందన్నారు. అనారోగ్యం కూడా తీవ్రం కావచ్చునని ఆసుపత్రిలో చేరాల్సి ఉంటుందన్నారు. పిల్లలు ఈ వైరస్ బారినపడితే దాదాపు అందరూ కోలుకుంటారన్నారు. డాక్టర్ల సలహా లేకుండా ఎవరూ సొంతవైద్యం చేసుకోరాదన్నారు. దీనికి ప్రత్యేకమైన టీకా లేవన్నారు. వైరస్ ప్రబలితే శుభ్రత పాటించడం, ఇంటిపట్టునే గడపడం, జనంమధ్యన వెళ్లకపోవడం, దగ్గు, తుమ్ములు వస్తే ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భయపడేంతటి జబ్బు కాకున్నా నిర్లక్ష్యం సరికాదన్నారు.

ఓంశక్తి భక్తులకు ఉచిత బస్సు

శిడ్లఘట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని చిక్కదాసేనహళ్ళి గ్రామానికి చెందిన ఓంశక్తి భక్తులకు మేల్‌మరువత్తూరుకు వెళ్లేందుకు జేడీఎస్ ప్రముఖులు ఉచిత బస్సు సదుపాయం కల్పించారు. సమీపంలోని కదిరినాయ కనహళ్ళిలోని ఓంశక్తి భక్తులు చేరుకుని పూజలు చేశారు. అనంతరం బస్సుకు కూడా పూజలు చేసి బయల్దేరారు. మేల్‌మరువత్తూరులోని ఓంశక్తి దేవాలయానికి బస్సు సదుపాయం కల్పించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. జేడీఎస్ నరసింహగౌడ తదితరులు పాల్గొన్నారు.



బయల్దేరుతున్న ఓంశక్తి భక్తులు

సుబ్రమణ్యేశ్వర బ్యాంకు అధ్యక్షుడిగా విజయసారథి

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్యేశ్వర కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడిగా విద్యానిపుణుడు డీఆర్ విజయసారథి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కేఎం రంగధామశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఏడాది ఉపాధ్యక్షుడిగా కొనసాగిన విజయసారథి ప్రస్తుతం అధ్యక్షులయ్యారు. ఐదేళ్లపాటు ఆయన హోదాలో కొనసాగుతారని ఎన్నికల అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు పాలకవర్గ డైరెక్టర్‌లుగా వెంకటాచలపతి, బీఎల్‌పీ రుద్రమూర్తి, సత్యమూర్తి, ఫాలనేత్ర, రోహిత్ నంజేగౌడ, రవీంద్ర, మహాలక్ష్మి, మారుతి, అన్నపూర్ణమ్మ, జయలక్ష్మి తోటగేరిలు ఉన్నారు. జనరల్ మేనేజర్ కృష్ణయ్యశెట్టి, సలహాదారుడు నాగరాజు పాల్గొన్నారు. అధ్యక్షుడు విజయసారథికి వాసవి గ్రూప్ విద్యాసంస్థల ముఖ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో కార్యవర్గం తదితరులు

హుణసేనహళ్లి సహకార సంఘానికి నూతన పదాధికారులు

బంగారపేట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హుణసేనహళ్ళి వివిధోద్దేశ ప్రాథమిక కృషి గ్రామీణ సహకారసంఘం పాలకవర్గం 11మంది ఏకగ్రీవం కాగా ఒకస్థానానికి మాత్రం ఎన్నికలు జరిగినట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్ స్థానానికి కెంపణ్ణ, సంతోష్‌కుమార్‌లు పోటీపడ్డారు. సంతోష్ కుమార్‌కు 2 ఓట్లు, కెంపణ్ణకు 5 ఓట్లు వచ్చాయి. అభ్యర్థులు ఎం గోవిందప్ప, నారాయణప్ప, శంకరప్ప, సీ మాదేశ్‌గౌడ, మునియమ్మ, వీఎస్ వీణా, హెచ్‌ఆర్ శ్రీనివాస్, నారాయణస్వామి, లక్ష్మమ్మలు ఏకగ్రీవమైనట్టు తెలిపారు. నూతన డైరెక్టర్ హెచ్‌ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో సహకారసంఘాన్ని బలోపేతం చేసి నూతన కార్యాలయాన్ని నిర్మిస్తామన్నారు. గ్రామీణ మహిళల స్వావలంబనకోసం స్త్రీశక్తి సంఘాలకు రుణాల మంజూరుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు హెచ్‌పీ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు గోపాలప్ప, జయరామ్, రమేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



నూతన డైరెక్టర్ల విజయోత్సాహం

బ్రెస్ట్ కేన్సర్‌కు అధునాతన వైద్యం

బొమ్మనహళ్ళి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ అంటే భయపడే పరిస్థితుల్లో ఉన్న తరుణంలో అధునాతన వైద్యంతో బ్రెస్ట్ కేన్సర్‌ను చికిత్సలు అందించి నయం చేయవచ్చునని అపోలో డాక్టర్ జయంతి తుమ్సి అభిప్రాయపడ్డారు. 2024లో ఆధునాతన విధానంలో వైద్యం అందించగా అందరూ కోలుకున్నారన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్థనాలను తొలగించకుండా వైద్యం అందించే సదుపాయం వచ్చిందన్నారు. రోబోటిక్ నిప్పల్ స్పేరింగ్ మాస్టక్టమీ ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. మీడియా సమావేశంలో మనీశ్ మాథ్యూ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో డాక్టర్ జయంతి తుమ్సి తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.34	1,588.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.198	0
నీటి నిల్వ (టీఎంసీలు)	71.20	10.18



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ గెహ్లాట్

విద్యతోనే అపార గౌరవం

● విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు
● గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్

బళ్లారి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యాజ్ఞానం ఉన్నవాడు ఎక్కడికి వెళ్లినా రాజగౌరవం పొందుతారని, ప్రతి ఒక్కరూ విద్యతో విజయం సాధించాలని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. బళ్లారి జిల్లా దమ్మూరు లో బీజేపీ నాయకుడు దమ్మూరు శేఖర్ స్థాపించిన పలు విద్యాసంస్థలకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, గాలి లక్ష్మిఅరుణ, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఈరోజు పెద్ద పెద్ద సంస్థలు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలకు విద్యతోనే గౌరవం లభించిందన్నారు. ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతికూల అంశాలను కూడా అనుకూలంగా మల్చుకోవడం, మనోనిబ్బరంతో ఉండడం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి అరుణ, విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దమ్మూరు శేఖర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి మనోనిబ్బరం, మనోధైర్యం, సమయస్ఫూర్తి, మానవ సేవ, ఇలాంటి మంచి గుణాలు అలవర్చుకుని దేశంకు ఉపయోగ పడే స్థాయికి ఎదగాలని కోరారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గిడ్డంగుల పరిశీలన

బళ్లారి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉప లోకాయుక్త అధికారులు శుక్రవారం ముండ్రిగీ లే- ఔట్, అలాగే అక్కడే ఉన్న ఆహార నిల్వలు ఉన్న గిడ్డంగులు, ఇండస్ట్రియల్ 2 స్టేజ్‌లో పారుతున్న జీన్స్ కెమికల్స్ వ్యర్థ నీరు. అలాగే తుంగభద్ర ఎగువ కాలువ నీటిలో కాలుష్యం అయిన నీరు కలుస్తున్న వాటిని పరిశీలించారు. అక్కడ సంబంధిత పొల్యూషన్, నగన కార్పొరేషన్ కమిషన్ అధికారుతో కలిసి వీటి పై సమాధానం ఇవ్వాలని కోరారు.



గోదాములను పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారుల బృందం

లంచం కేన్సర్ కన్నా ప్రమాదం

● కార్యాలయాల్లో చేయిచాచి హీనులు కావద్దు ● సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోండి : ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉప లోకాయుక్త బృందం

బళ్లారి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): లంచం కోసం చేయిచాస్తూ సమాజంలో హీనులు కావద్దు, లంచం అనేది కేన్సర్ కన్నా ప్రమాద కరమని, ప్రజలకు సేవల చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప ఉద్యోగులకు సూచించారు. బళ్లారి లో ఉప లోకాయుక్త బృందం పర్యటనలో బాగంగా రెండవరోజు అయిన శుక్రవారం జోళదరాసి దొడ్డన గౌడ రంగమందిరంలో లోకాయుక్తకు వచ్చిన పిర్యాదుల విచారణ, కేసుల పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఫిర్యాదు దారులు పాల్గొన్నారు. ముందుగా ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప ఇతర లోకాయుక్త అధికారులు, జిల్లా అధికారులు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం ఉప లోకాయుక్త బి. వీరన్న మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందే హక్కు ప్రజలకు ఉందన్నారు. రాజ్యాంగానికి లోబడి ఉప లోకాయుక్త పనిచేస్తుందని ప్రతి పేదవాడికి న్యాయం జరగాలన్నారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా లోకాయుక్త ఉరుకోదని తన వంతు కర్తవ్యంగా పని చేస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల అయినా రాజ్యాంగ హక్కులు అవినీతితో అణచివేయబడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియా నిజాయితీగా పనిచేస్తే సమాజంలోని తప్పులను సరిదిద్దవచ్చన్నారు. తద్వారా నిజాయితీ గల సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం సరిహద్దులో సైనికులు ప్రాణాలు తెగించి పోరాడుతున్నారు. కానీ సమాజంలో ఉండే మనం స్వార్థంతో పనిచేస్తున్నామన్నారు. లోకాయుక్త లక్ష్యం ప్రజల బాధలను పరిష్కరించడం, అవినీతిని నిర్మూలించడమే అన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడం, నిర్లక్ష్యం చేయడం సహించం అన్నారు. ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, లోకాయుక్త అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



వృద్ధురాలితో ముఖాముఖి నిర్వహిస్తున్న అధికారులు

రైల్వే ట్రాక్‌ను మార్చాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు శివరుద్రప్ప, మారెణ్ణ

బళ్లారి సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిందాల్ ఫ్యాక్టరీ కోసం హద్దినగుండు నుంచి హలకుంది వరకు నూతనంగా నిర్మించిన రైలు మార్గాన్ని మార్చాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. అంద్రాల్, బి.గోనాల్,బొబ్బకుంటె తదితర గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో రైతు శివరుద్రప్ప, అంద్రాల్ మారెణ్ణ మాట్లాడుతూ ఈ రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. ఇది నగర పరిధిలోకి వస్తోంది, దీని నుంచడి 1లేదా 2ఎకరాలు సాగునీటి భూమి మాకు జీవనోపాధికి అందుబాటులో ఉంది. ఇక్కడ అధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులున్నారని, రైల్వే లైన్ ఏర్పాటుతో ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికే బళ్లారి చుట్టూ రింగ్‌రోడ్డు, బైపాస్ రోడ్డుకు భూమి ఇచ్చారు. అందకు గ్రామీణ ప్రాంతామైన హగరి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత ఓబలాపూర్ గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌ను రింగ్‌ప్యాటర్న్‌గా మార్చేలా కొత్త రైల్వే ట్రాక్ రూట్‌ను మార్చాలని రైల్వే మంత్రిని అభ్యర్థించారు. ఈసందర్భంలో రైతులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు ప్రారంభించండి

● మంత్రి పాటిల్‌కు రైతు సంఘం నాయకుల వినతి

బళ్లారిరూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర హసురుసేన రాష్ట్ర అధ్యక్షులు మాధవరెడ్డి నేతృత్వంలో కృషి మార్కెట్ మంత్రి శివానంద పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నగరానికి వచ్చిన మంత్రిని కలిసిన వారు బళ్లారిలో అత్యధిక స్థాయిలో మిర్చి పంటను రైతులు సాగు చేస్తారని దీంతో పాటు సరిహద్దు ప్రాంతమైన అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు పలు జిల్లాల నుండి మిర్చి పంట ఎక్కువగా పండించి వేరే రాష్ట్రాలకు తరలించకుండా ఇక్కడికే తరలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్ రాజ్, నాగిరెడ్డి, రైతు నాయకులు చాగనూరు మల్లికార్జునరెడ్డి, టీజీ విఠల్, లేపాక్షి, విశ్వనాథ్, బసవరాజుస్వామి, పంపన్నగౌడ, ఈశ్వరరెడ్డి, బసిరెడ్డి, గోపాల్‌రెడ్డి, తిమ్మన్నగౌడ, ఉమ హరిగౌడ, పలువురు రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతు నాయకులు మాధవరెడ్డి

వినాయకుడికి ప్రత్యేక పూజలు

కంప్లి, జనవరి 17(ఆంధ్ర జ్యోతి): గంగావతి రోడ్డులోని వరసిద్ధి వినాయక సంకష్టి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకాలంకరణ చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి కూడా పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.



యువకుడి మృతదేహం లభ్యం

కంప్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం హంపి పుణ్యక్షేత్రంలోని కోదండరామ దేవస్థానం చక్రతీర్థం వద్ద తిప్పేస్వామి (21) అనే యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం యువకుడి మృతదేహం లభ్యమయ్యింది. అగ్నిమాపక దళాలు గత రెండు రోజులుగా నదిలో పరిశీలించగా చివరకు చక్రతీర్థం వద్ద నీటిలో రాళ్ల మధ్యల్లో మృతదేహం కనిపించింది. తిప్పేస్వామి చెళ్లకెర తాలుకా రెడ్డిహళ్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు. యువకుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



తిప్పేస్వామి (ఫైల్)

అవార్డు గ్రహీతకు అభినందనలు

సిరుగుప్ప, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ఖలీఫా అవార్డుకు ఎంపికైన అబ్దుల్ సమద్‌ను శుక్రవారం1వ వార్డు సౌదాగర్ మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గుల్బర్గా, హైదరాబాద్‌కు చెందిన నిజామియా మసీదులో ఖలీఫా అవార్డును అందజేసి ప్రశంసించారు. సౌదాగర్ మసీదు కమిటీ అధ్యక్షుడు అండి హుస్సేన్ బాషా, అబ్దుల్ నబీ పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న అక్షరాస్యత ఉప సంచాకులు ఉమాదేవి

'విద్యాయాత్ర' ప్రారంభం

బళ్లారి సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టూరిజం శాఖ తరపున ఎస్సీ, ఎస్టీ, టీపీసీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కర్ణాటక దర్శన్ పర్యటన కార్యక్రమాన్ని పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ ఉప సంచాలకులు బి.ఉమాదేవి శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని అనంతపురం రోడ్డు నూతన జిల్లా పరిపాలన భవనం ఆవరణలో ఆమె మాట్లాడుతూ విద్యాయాత్ర ద్వారా విద్యార్థులకు చారిత్రక ప్రదేశాలపై అవగాహన ఏర్పడుతుం దన్నారు. కర్ణాటక దర్శన్ టూర్ కార్యక్రమానికి బళ్లారి జిల్లాకు చెందిన 270 షెడ్యూల్డ్ కులాలు, 309 షెడ్యూల్డ్ తెగల విద్యార్థులు మొత్తం 570 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. దాని ప్రకారం 8, 9వ తరగతికి చెందిన 154మంది విద్యార్థులు మొదటి దశలో బయల్దేరారన్నారు. మొత్తం నాలుగు రోజుల పర్యటనలో చిత్రదుర్గ, బేలూరు, హలేబీడు, శ్రావణబెళగల్లు, తలకావేరి, మడికేరి, మైసూరు, శ్రీరంగపట్టణం సహా పలు పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి తెలిపారు. అదే సమయంలో టూర్ ప్రోగాంకు ఎంపికైన అభ్యర్థులకు బ్యాగ్, నోట్‌బుక్, టీషర్ట్, క్యాప్ ,పెన్, కర్ణాటక మ్యాప్, రోజువారీ ఉపయోగించే టూత్‌పేస్ట్, సబ్బు, షాంపూ,హెయిర్ ఆయిల్, దువ్వెన తదితరాలతో కూడిన బాత్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్షేత్ర విద్యాధికారి నయీమూర్ రెహమాన్, జిల్లానోడల్ అధికారి నరసింహమూర్తి, తాలూకా నోడల్ అధికారి గూలెప్ప, కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కర్ణాటక దర్శన్ టూర్ ప్రోగ్రాం అమలు సంస్థ అధికారులు ,సిబ్బంది , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఏపీఎంసీ ఉపాధ్యక్షుడు



నూతన ఉపాధ్యక్షుడు రామన్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

బళ్లారిరూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఏపీఎంసీ ఉపాధ్యక్షుడిగా ఎంపికైన కప్పగల్ రామన్న ఎమ్మెల్యే గణేష్, ఏపీఎంసీ మార్కెట్ అధ్యక్షుడు కట్టమని నాగేంద్ర నేతృత్వంలో శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సీదరగడ్డ ఆర్ సిద్దప్ప, కొర్లగుంది ప్రభాకర్‌రెడ్డి, అందిహాళ్ నజీర్‌సాబ్ పలు మార్కెట్ సభ్యులు నూతన పదాధికారులు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయం ప్రారంభం

బళ్లారి సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ ఈ తుకారం నూతనంగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు వినేందుకు, ఫిర్యాదులు స్వీకరించేందుకు అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కార్యాలయంలో అవసరమైన సిబ్బందిని నియమిస్తారు, జిల్లా అభివృద్ధికి అనుబందంగా రైల్వే ఫ్లైఓవర్ పనులతోపాటు ఇతర పనులను వేగవంతం చేస్తామన్నారు. ఎలాంటి అశాస్త్రీయ పనులను అనుమతించబోమన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రైల్వే అభివృద్ధికి భూములు సేకరించబోమన్నారు. ఈ సందర్భంగా సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, బళ్లారి మేయర్ ముల్లంగి నందీష్, సీనియర్ నాయకులు, కార్పోరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారం, ఎమ్మెల్యే అన్నపూర్ణ

రెవెన్యూ శాఖలో డిజిటల్ విధానం

కంప్లి, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : ఇకపై రెవెన్యూ శాఖలో డిజిటల్ పద్ధతి అమలులోకి వస్తుందని జేఎన్ గణేష్ తెలిపారు. కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటలీకరణ నమోదును ఆయన ప్రారంబించారు. గతంలో ఈ పద్ధతి లేకపోవడంతో ఎన్నో పత్రాలు దొరకక రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అలా కాకుండా ప్రతి ఒక్క సర్వే నెంబర్ గానీ, విస్తరణకు సంబంధించి ఏవైనా సరే ఈ డిజిటల్ పద్ధతి ద్వారా సదుపాయాలు పొందవచ్చునన్నారు. దీంతో ఎన్ని సంవత్సరాలైనా సరే అందులో డేటా నిల్వ వుంటుందని, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వుంటాయన్నారు. ఇప్పుడున్న తంత్రజ్ఞానాన్ని దృష్టిలో వుంచుకుని తమ ప్రభుత్వం డిజిటల్ పద్ధతిని అమలు చేసిందన్నారు. అలాగే పట్టణంలో కావాల్సిన శిక్షణ, ఇంజనీరింగ్ కళాశాల త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తహసీల్దార్ శివరాజ్, షణ్ముఖ, రమేష్, ఆర్ఐ జగదీష్, సురేష్, మాంతేష్, పురసభ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

దానిమ్మ దొంగల పట్టివేత



పోలీస్ స్టేషన్ ఎదుట కూర్చున్న రైతులు
స్వాధీనం చేసుకున్న దానిమ్మ పండ్లు

కంప్లి, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : కురుగోడు తాలుకా పరిధిలోని శ్రీనివాసనగర్ క్యాంపు వద్ద శుక్రవారం సాయంత్రం ఐదుగురు దానిమ్మ దొంగలను రైతులు పట్టుకున్నారు. రైతులు శ్రీనివాసనగర్ బస్టాండు వద్ద కూర్చున్న సమయంలో ఐదుమంది ద్విచక్ర వాహనాలపై దానిమ్మ పండ్లు కోసుకుని వస్తుండగా అనుమానంతో రైతులు విచారించగా ఆ ఐదు మంది తమ తోటలోనివేనని తెలిపారు. దీంతో రైతులు ఇక్కడ మీ తోటలు ఎక్కడున్నాయని ప్రశ్నించడంతో తడబడ్డారు. వారితో వున్న దానిమ్మ పండ్లను రైతులు స్వాధీనం చేసుకుని వారిని కురుగోడు పోలీసులకు అప్పగించారు. గత కొన్ని రోజులుగా శ్రీనివాసనగర్ క్యాంపు, కలకంబ్ల, ముష్టిగట్టి, కురుగోడు, యల్లాపురం తదితర గ్రామాల్లో దానిమ్మ తోటలో దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంపైన కురుగోడు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

హోసూరు జోన్

నేడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం

హోసూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హోసూరు కామరాజకాలనీలోని ఆంధ్రసాంస్కృతిక సమితి భవనంలో నాదబ్రహ్మ త్యాగరాజస్వామి 178వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. శనివారం ఏర్పాటయ్యే కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమితి కార్యవర్గం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు కళాకారులు డిఎం.జయరాం, జగదీశ్, నవీన్‌కుమార్, యశ్వంత్‌ల బృందంచే మంగళవాద్యం, 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఆంధ్రసాంస్కృతిక సమితి ఎం.దేవరాజు శిష్య బృందంచే గోష్ఠిగానం, త్యాగరాజ కీర్తనలు, పంచరత్న కీర్తనల ఆలాపన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాషాభిమానులు, తెలుగు సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొనాలని కోరారు.

నేడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాక

రాయచూరు జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్యకీయ శిక్షణ శాఖ, రాయచూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్ శనివారం జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన రానున్నట్లు వ్యక్తిగత కార్యదర్శి కృష్ణగౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11:30కు జిల్లా కేంద్రానికి చేరుకున్న అనంతరం మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొనే మధ్యాహ్నం 3:30 గంటలకు ఇక్కడ నుంచి కలబుర్గికి బయలుదేరి వెళతారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాయచూరు జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో తలెత్తిన కలహాల నేపథ్యంలో వ్యక్తి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో చోటు చేసుకుంది. మృతుడు కుష్టగి ప్రాంతానికి చెందిన వైద్యుడు రమేశ్ జాదవ్(38)గా పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించి మృతికి గల కారణాల పై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు.

ఎంజీఆర్‌కు ఘన నివాళి



ఎంజీఆర్‌కు నివాళి అర్పిస్తున్న అన్నా డీఎంకే నాయకులు, కార్యకర్తలు

హోసూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) 108వ జయంతిని కృష్ణగిరి జిల్లా హోసూరు నగరంలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. అన్నాడీఎంకే జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించి మిఠాయిలు పంచిపెట్టారు. ఆ తర్వాత రాయకోట రోడ్డులోని ఎంజీఆర్ విగ్రహానికి, విక్టోరియా హోటల్ సమీపానగల ఎంజీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంజీఆర్ కౌన్సిల్ జిల్లా సంయుక్త కార్యదర్శి జై.ప్రకాశ్, కార్యదర్శులు వాసుదేవన్, రాజి, మంజు, హోసూరు కౌన్సిలర్లు కుబేరన్, లక్ష్మీహేమకుమార్, శిల్పా శివకుమార్, రఘుమాన్, రిజిని, హోసూరు నగర కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు నంజుండస్వామి, అణ్ణా పరిశ్రమ సంఘం జిల్లా కార్యదర్శి న్యాయవాది డివిజన్ జిల్లా సంయుక్త కార్యదర్శి న్యాయవాది ఆది వెంకటాచలం, జిల్లా ఉపాధ్యాక్షుడు చంద్రన్, మురుగన్ బాలుస్వామి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువును బాగు చేయండి

హోసూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపానగల చంద్రాంబికై చెరువులోని గుర్రపుడెక్క తొలగించి కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాలక్రమేణా చెరువులు కనుమరుగైపోతున్న తరుణంలో హోసూరులో కొన్ని మాత్రమే ఉన్నాయి. హోసూరు- బెంగళూరు జాతీయ రహదారి పక్కన దర్గా ప్రాంతంలో చంద్రాంబికై చెరువు ఉంది. నిత్యం నీటితో ఉంటూ ఏడాది పొడవునా ఉండడంతో విదేశీ పక్షులు వచ్చి వెళ్తుంటాయి. కాగా చెరువు చుట్టూ ఇళ్లు, ఇతరప్రాంతాలు ఆక్రమణలకు గురికావడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థజలాలు నేరుగా చెరువులో కలుస్తుండగా తాజాగా కొన్నిరోజులుగా గురప్పుడక్కతో చెరువు నిండిపోయింది. చెరువు నీటిని శుద్ధీకరించి బోటింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గుర్రపు డెక్కతో నిండిన చెరువు

